భూభారతి.. భూమికి భద్రత

భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కొత్తగా తెచ్చిన 'భూభారతి' చట్టంతో తమ సమస్యలకు పరిష్కారం దొరికేనా అని రైతులు ఎదురు చూస్తున్నారు. పోర్టల్ గురించి అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామీణ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయడంతో.. ఇక భూ బాధలు గట్టెక్కినట్లేనన్న భరోసాతో ఉన్నారు.

- చట్టం కోసం రైతుల ఎదురు చూపు
- ధరణితో మోసపోయామంటూ ఆవేదన
- సమస్యల పరిష్కారం కోసం ఆరాటం



మంచాల: ధరణి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 'భూభారతి' చట్టాన్ని తీసుకువచ్చింది. పైలట్ ప్రాజెక్టుగా పలు మండలాల్లో అమలు తీరును పరిశీలిస్తోంది. రైతుల అభిప్రాయాలు, సూచనల అనంతరం మార్పులు చేర్పులతో పూర్తి స్థాయిలో అమలుకు శ్రీకారం చుట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. అయితే ధరణితో దగాపడ్డామని, భూ సమస్యలతో సతమతమవుతున్నామని, ప్రస్తుత చట్టంతోనైనా న్యాయం దొరుకుతుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. మంచాల మండలంలో చిన్నసన్నకారు రైతులే అధికంగా ఉన్నారు. సాగుపై ఆధారపడిన జీవితాలకు భూముల ధరలకు రెక్కలు రావడం సంతోషకరమే అయినా.. భూ సమస్యలు పెరిగి ఆందోళనకు గురిచేస్తోంది. దానికి తోడు ధరణి రావడం, సాగు కాలం తొలగించడం, పట్టా కాలం ప్రమాణికంగా తీసుకోవడం మరింత ఇబ్బందిగా మారింది. ధరణికి ముందు 40 ఏళ్ల క్రితం భూములు కొనుగోలు చేసుకుని, సాగు చేసుకుంటున్న రైతుల పేర్లు కూడా పట్టా కాలం (రికార్డు) నుంచి తొలగించారు. చాలా మంది రైతులు నాడు రెవెన్యూ అధికారులు చేతి రాతతో రాసి ఇచ్చిన పహాణీలనే నమ్మారు. దాని ఆధారంగానే చాలా మంది రుణాలు తీసుకున్నారు. పట్టా పాసు పుస్తకం ఉంది కదా, కబ్జాలో మనమే ఉన్నామనే భరోసాతో ఉన్నారు.

గుంటలుగా మారిన ఎకరాలు!

ధరణి రావడంతో రికార్డులో చాలామంది పేర్లు లేకుండా పోయాయి. ఎప్పుడో అమ్మేసుకున్న వారి పేర్లు తిరిగి రికార్డులో చేరాయి. కొంత మంది ఆర్ఓఆర్‌లో సాదాబైనామా మీద పట్టా చేసుకున్న వారివి కూడా రికార్డుల్లో లేకుండా పోయాయి. ఇదీలా ఉండగా ఎకరాల్లో ఉన్న భూమి రికార్డులో గుంటలుగా మారింది. ఇదేమిటని అడిగిన బాధిత రైతులకు.. ధరణిలో ఎగిరి పోయాయని, తమ చేతుల్లో ఏమీ లేదని అధికారులు చేతులు ఎత్తేశారు. నాడు అవసరాల కోసం భూమి విక్రయించుకున్న రైతుల పేర్లు తిరిగి రికార్డులో రావడంతో.. మరలా విక్రయించారు. అలా వీలు కాని పక్షంలో.. నాడు తక్కువ ధరకు ఇచ్చాం, ప్రస్తుతం మరిన్ని డబ్బులు ఇస్తే.. పట్టా చేస్తామని వసూళ్లకు పాల్పడుతున్నారు. మరికొంత మంది మా పేర్ల మీద భూమి వచ్చింది. మాకు భూమి కావాలని నాడు కొనుగోలు చేసిన వారిని కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. ఇలా ధరణితో అనేక మంది రైతులు అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

పెండింగ్‌లో 308 దరఖాస్తులు

మంచాల మండలంలో చాలా కాలంగా 308 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో టీఎం.33- 177, సక్సెషన్- 39, పీఓబీ- 37, మ్యుటేషన్- 19, కోర్టు కేసు- 15, కోర్టు ఇన్ఫర్మేషన్- 10, నాలా హౌసింగ్- 4, జీఎల్ఎం- 03, నాలా విత్ఔట్ పీబీపీ- 4 ఇలా దరఖాస్తులు పేరుకుపోయాయి.

గ్రామాల్లోనే పరిష్కారం

ప్రస్తుత భూ భారతి ద్వారా ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా గ్రామ స్థాయిలోనే రికార్డుల నమోదు ప్రక్రియ ఉండడంతో చాలా సమస్యలకు అక్కడే పరిష్కారం లభించే అవకాశం ఉందని చట్టం పేర్కొంటుంది. రైతుల భూమిని సర్వే చేసి, మ్యాప్ సిద్ధం చేయడంతో భూమి ఎక్కడ ఎంత ఉందనే విషయం బయటకు తెలుస్తుంది. భూ హక్కులు ఏ విధంగా సంక్రమించాయనేది రికార్డులో నమోదు చేస్తారు. దీంతో అక్రమ పట్టాలు తొలగిపోయే అవకాశం ఉంది.

ఆధార్.. భూధార్

ఆధార్ కార్డు లాగే భూధార్ కార్డును తెచ్చారు. రికార్డులో తప్పులను సవరణ చేయడం, భూ హక్కు ఉండి, రికార్డులో లేని వారి పేర్లను రికార్డులో నమోదు చేస్తారు. గతంలో రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదు చేసినా పరిష్కారం చేయకుండా కోర్టుకు వెళ్లమని సంబంధిత అధికారులు చెప్పేవారు. ఈ చట్టం ద్వారా నేరుగా రెవెన్యూ అధికారి విచారణ చేసి, నిర్ణయం తీసుకునే అధికారం ఉంది. న్యాయం కోసం రెండు అంచెల అప్పీల్ వ్యవస్థను తెచ్చారు. ఈ చట్టం సక్రమంగా అమలు జరిగితే నిజమైన రైతులకు న్యాయం జరుగుతుందనే ఆశాభావం రైతులు, ప్రజల్లో నెలకొంది.

రైతులకు మేలు



భూభారతి చట్టం కచ్చితంగా అమలు చేయాలి. అప్పుడే గ్రామాల్లో అక్రమ పట్టాదారుల నుంచి నిజమైన రైతులకు మేలు జరుగుతుంది. ఏళ్లుగా సాగు చేసుకొని జీవిస్తున్న సన్న, చిన్నకారు రైతుల పేర్లు రికార్డుల్లో లేక ఇబ్బంది పడుతున్నారు.

– గోగిరెడ్డి లచ్చిరెడ్డి, తాళ్లపల్లి గూడ

పక్కాగా అమలు చేస్తాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తాం. నిజమైన రైతులకు చట్టబద్ధంగా న్యాయం జరుగుతుంది. అక్రమ పట్టాదారులను తొలగించి, విచారణ అనంతరం అసలైన వారి పేర్లు రికార్డుల్లో నమోదు చేస్తాం. గ్రామ స్థాయిలో చట్టం గురించి అవగాహన కల్పిస్తున్నాం.

– ఎం.వీ.ప్రసాద్, తహసీల్దార్, మంచాల

కొనుగోలు కేంద్రాల్లో విక్రయించండి

మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి



లోయపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన గురునాథ్‌రెడ్డి తదితరులు

మంచాల: రైతులు తమ దిగుబడిని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి, మద్దతు ధర పొందాలని ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి అన్నారు. దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని సూచించారు. బుధవారం మంచాల మండలం లోయపల్లి, బోడకొండ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం వరిని కొనుగోలు చేస్తామని తెలిపారు. 'ఏ' గ్రేడ్ వరికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2320లు, మిగతా వడ్లకు రూ.2300లు, సన్నాలకు బోనస్‌గా రూ.500 ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, డీసీఎంఎస్ మేనేజర్ రామ కృష్ణరాజు, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి వెంకటేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాండు, ఎల్లేష్, కాంగ్రెస్ రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి జయమ్మ, మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, జంగయ్య, సురేష్, రాజు, జంగయ్య గౌడ్, మోతీరాం నాయక్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో పుస్తకావిష్కరణ



పుస్తక ఆవిష్కరణలో ప్రిన్సిపాల్ రాధిక, అధ్యాపకులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రమేశ్ రచించిన 'భారత దేశ ఆర్థిక అభివృద్ధిలో పాలసీ విధానంలో సవాళ్లు' అనే పుస్తకాన్ని ప్రిన్సిపాల్ రాధిక, అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ.. దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే అంశాన్ని రచయిత.. పాఠకులకు అర్థమయ్యే విధంగా పరిశోధనాత్మకంగా రాశారని తెలిపారు. ఓపెన్ ఇంటర్, ఎంఏ ఎకనామిక్స్ ఓపెన్ యూనివర్సిటీ పాఠ్యాంశాలను రచించి, విద్యార్థుల అభ్యున్నతికి ఎంతగానో రమేశ్ తోడ్పడ్డారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా మరిన్ని ఉత్తమమైన పుస్తకాలను ఆయన రచించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్, అధ్యాపకులు చింతల రాకేశ్‌భవాని, కృష్ణ, నరేందర్‌రెడ్డి, మాధవి, రవికుమార్, డివి రావులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్సీ కవిత



వధూవరులతో ఎమ్మెల్సీ కవిత

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త సాకేత్ సోదరి వివాహం జరిగింది. ఈ సందర్భంగా పెళ్లికి హాజరైన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు రైతులకు అవగాహన సదస్సు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలో గురువారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నామని ఆ శాఖ అధికారి సౌమ్య తెలిపారు. ఆయిల్ ఫాం తోటల సాగు, డ్రిప్ ఇరిగేషన్‌పై వివరిస్తామని వెల్లడించారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలందుకుంటున్న గణపతి స్వామి

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్ శ్రీ లక్ష్మీ నారాయణస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో అఖండ దీపారాధన, పుణ్యాహవాచనం, రుత్వీకరణం, మంటపారాధన, పతాకావిష్కరణ, అభిషేకం, భగవద్గీత పారాయణం, గణపతి పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

రజతోత్సవ సభకు తరలిరండి



వాల్‌రైటింగ్ చేయిస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. బుధవారం గ్రామాల్లో ఆయన పర్యటించారు. సభ నేపథ్యంలో వాల్‌రైటింగ్, వాల్‌పోస్టర్ల ద్వారా ప్రచారం చేపట్టారు.

సామాజిక తనిఖీ గ్రామ సభలు



గ్రామ సభలో అధికారులు, కూలీలు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్ తండా, హర్యాతండాల గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ.. ఉపాధి నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. డీఆర్పీలు వెంకటేశ్, మౌనిక, పంచాయతీ కార్యదర్శి నంద కుమార్, ఆశిష్‌రెడ్డి, తిరుపతయ్య, ఈసీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధి పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బుధవారం నగరంలోని తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, గుర్రం కేశవులు, యాట నర్సింహ, గూడురు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, జగన్, శ్రీకాంత్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలు అమలు చేయాలి

యాచారం: హైకోర్టు ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ఫార్మా సిటీకి భూములు ఇవ్వలేదని, 2,500 ఎకరాల పట్టా భూముల రైతుల పేర్లను రికార్డుల్లోంచి తొలగించి, టీజీఐఐసీ పేరిట నమోదు చేసిందని విమర్శించారు. నాలుగేళ్లుగా రైతులు తమ పేర్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నారని, హైకోర్టు కూడా వారి పేర్లు నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చిందని, అయినా అధికారులు స్పందించడం ఆరోపించారు. ప్రభుత్వం.. ఫార్మా భూముల్లో పోలీస్ బందోబస్తుతో ఫెన్సింగ్, సర్వే పనులు చేపట్టడంతో రైతుల్లో భయాందోళన నెలకొందని పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పశుపోషణలో జాగ్రత్తలు తప్పనిసరి

మొయినాబాద్: పాడి పశువుల పోషణలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారంలో బుధవారం గాలికుంటు నివారణ టీకాలు వేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని 238 పశువులకు టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాతావరణ మార్పులతో పశువులకు రోగాలు వస్తాయని, వాటి నివారణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా టీకాలు ఇప్పించాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా ఉచితంగా వేస్తున్న టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, మున్సిపల్ కమిషనర్, నాయకులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: చేవెళ్ల మున్సిపాలిటీతో పాటు పట్టణ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపాలిటీ కార్యాలయం వద్ద బుధవారం నూతనంగా కొనుగోలు చేసిన రోడ్లు శుభ్రం చేసే యంత్రం, డోజర్ వాహనాలను మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. మున్సిపాలిటీలో రోడ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు ఈ పరికరాలు ఉపయోగపడతాయన్నారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీ పరిధిలో విలీనమైన గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసేందుకు సహకరిస్తానని, అధికారులు ఆ దిశగా పనిచేయాలని సూచించారు. వేసవిలో ఎక్కడ తాగునీటి సమస్యలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ నాయకులు జనార్దన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు డీవీఆర్, గోనే ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, నియోజకవర్గ నాయకుడు వసంతం, మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

'మాల్'ను ఆదర్శంగా తీసుకోండి

యాచారం: 'ఆత్మ నిర్భర్' జాతీయ అవార్డును కైవసం చేసుకున్న మాల్ గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీసుకోవాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. గ్రామానికి అవార్డు దక్కడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. దీనిని స్ఫూర్తిగా తీసుకొని పంచాయతీలన్నీ.. ఆర్థిక ప్రగతిలో పోటీపడాలని సూచించారు.

ఉగ్రవాదులను శిక్షించాలి

- బీఆర్ఎస్, బీజేపీల నాయకుల డిమాండ్
- కశ్మీర్ దాడులకు నిరసనగా ముష్కరుల దిష్టిబొమ్మల దహనం



ఆమనగల్లు: ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



తుర్కయంజాల్: నిరసన వ్యక్తంచేస్తున్న బీజేపీ శ్రేణులు

ఇబ్రహీంపట్నం/ ఆమనగల్లు: హిందువులే లక్ష్యంగా ఉగ్రవాదులు దాడులకు పాల్పడుతున్నారని, 28 మంది అమాయక ప్రజల ప్రాణాలను బలితీసుకున్నారని బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ముష్కరులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. జమ్ము కశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లా పహల్గామ్‌లో మంగళవారం ఉగ్రవాదులు.. 28 మంది పర్యాటకులను కాల్చి చంపడాన్ని నిరసిస్తూ బుధవారం ఆమనగల్లు పట్టణంలో భారీ ర్యాలీ తీశారు. జాతీయ రహదారిపై రాజీవ్ కూడలిలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దుర్గయ్య, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బీజేవైఎం అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సందీప్, నర్సింహ, లక్ష్మణ్, శేఖర్, కృష్ణనాయక్, చెన్నకేశవులు, శ్రీకాంత్‌సింగ్, రవిరాథోడ్, ప్రశాంత్, నరేందర్, బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు సరిత, కుమార్, మాజీ కౌన్సిలర్ వెంకటయ్య, నాయకులు బాలస్వామి, రమేశ్, వెంకటేశ్, సుభాష్, యాదయ్య, శివకుమార్, సైదులుగౌడ్, కొమ్ము ప్రసాద్, సతీష్ ఉన్నారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: కశ్మీర్‌లో హిందువులపై ఉగ్రవాదులు జరిపిన దాడులను బీజేపీ శ్రేణులు ఖండించారు. భారీగా నిరసన వ్యక్తంచేశారు. బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర కార్యదర్శి బచ్చిగళ్ల రమేష్, మున్సిపల్ అధ్యక్షుడు ఎలిమినేటి నర్సింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు తూళ్ల నర్సింహ గౌడ్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడికి నిరసనగా.. ఇబ్రహీంపట్నంలో బీజేపీ, హిందూవాహిని సంస్థల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులు, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



ఇబ్రహీంపట్నం: బీజేపీ, హిందూవాహిని నాయకుల నిరసన

అలజడులు రేపేందుకు కుట్ర



కొవ్వొత్తులతో నిరసన తెలిపిన నాయకులు, యువకులు

కడ్తాల్: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని ఖండిస్తూ బుధవారం రాత్రి మండల కేంద్రంలో మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు కొవ్వొత్తులతో నిరసన వ్యకం చేశారు. మృతులకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పాకిస్థాన్ ముష్కరులు పర్యాటకులను అత్యంత కిరాతకంగా కాల్చి చంపడం హేయమైన చర్యని మండిపడ్డారు. దేశంలో అలజడులు సృష్టించడానికి, మత విద్వేశాలు రగిలించడానికి ఉగ్రవాదులు చేసిన కుట్రేనని, అది ఎన్నటికీ ఫలించబోదని స్పష్టంచేశారు. అమాయకుల ప్రాణాలను బలితీసుకున్న ఉగ్రమూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు భగీరథ్, మహేశ్, రవీందర్‌రెడ్డి, మాన్యనాయక్, అశోక్‌రెడ్డి, ప్రభు, విక్రమ్, మహేశ్, మహేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బడికి బైబై..

- ఇంటిబాట పట్టిన విద్యార్థులు
- విద్యాసంస్థలకు సెలవు



కడ్తాల్: బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న ఉపాధ్యాయులు



ఇబ్రహీంపట్నం: సొంతూరుకు వెళ్తున్న 6వ తరగతి విద్యార్థి నిహారిక



అబ్దుల్లాపూర్‌మెట్: తల్లితో బాటసింగారం బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థి

ఇబ్రహీంపట్నం: గడిచిన విద్యాసంవత్సరంలో పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థులు ఇంటి బాట పట్టారు. వార్షిక పరీక్షలు ముగిసి, ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ప్రభుత్వం పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించింది. దీంతో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలకు తమ పిల్లలను తీసుకువెళ్లేందుకు వారి తల్లిదండ్రులు రావడంతో సందడి నెలకొంది. ప్రోగ్రెస్ రిపోర్టులు చేత పట్టుకొని ఉత్సాహంతో తోటి స్నేహితులతో సరదాగా కాసేపు గడిపారు. మళ్లీ కలుద్దామంటూ వీడ్కోలు పలికారు. తమవారితో వారివారి గమ్యస్థానాలకు వెళ్లారు.

టాపర్‌కు అభినందన

పట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 6వ తరగతి విద్యార్థి కుషాల్ టాపర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, పలువురు విద్యార్థిని అభినందించారు. భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా.. వెసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటానని 8వ తరగతి హర్షిణి తెలిపారు. వెన్నెల ఫౌండేషన్‌లో కల్చరల్ యాక్టివిటీలో శిక్షణ తీసుకుంటాని పేర్కొంది. డ్యాన్స్, మ్యూజిక్ అంటే ఎంతో ఇష్టమని, గణితం ప్రాక్టీస్ చేస్తానని బాలిక చెప్పింది.



కడ్తాల్: కేజీబీవీలో పాఠశాలలో..



మంచాల: జాపాల ఉన్నత పాఠశాలలో ప్రోగ్రెస్ కార్డులతో చిన్నారులు



ఇబ్రహీంపట్నం: నల్లకంచె గురుకులంలో ప్రోగ్రెస్ కార్డులతో..